క్లుప్తంగా

ప్రాణ ప్రతిష్ట వేడుకల్లో ఎమ్మెల్యే కాటసాని



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: మండల పరిధిలోని రసూల్లపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులాప రమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారి ప్రాణ ప్రతిష్ట వేడుకలు నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ మాధవి, నాయకులు సుమంత్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాబు, గౌడ్, శేషయ్య, బాలిరెడ్డి ఉన్నారు.

పాణ్యంలో 9 నామినేషన్లు తిరస్కరణ



పాణ్యం ఆర్వో మౌర్య

కర్నూలు(సెంట్రల్): పాణ్యం నియోజకవర్గంలో వివరాలు సరిగ్గా లేని 9 నామినేషన్లను తిరస్కరించినట్లు నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. మొత్తం 23 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. 9 నామినేషన్లు తిరస్కరణకు గురికావడంతో బరిలో 14 మంది ఉన్నట్లు చెప్పారు. 27, 29 తేదీల్లో నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. మరోవైపు పోస్టల్ బ్యాలెట్ ఓటరు జాబితాను శనివారం ప్రకటిస్తామని తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

పాణ్యం: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఈఓ ఆనందరావు అన్నారు. శుక్రవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా పాణ్యంలో సచివాలయ సిబ్బంది, బీఎల్‌ఓల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని పేర్కొన్నారు. ఓటు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుందన్నారు.

వైభవంగా కుంభాభిషేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

గడివేముల: మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలో గణపతి, పార్వతీ, కాలభైరవ, నందీశ్వర, నవగ్రహ, నాగదేవతా విగ్రహాల ప్రతిష్టాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాప మహోత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. యంత్ర దేవతా, దీక్షాహోమాలు, ప్రతిష్టాపన హోమాల అనంతరం మహాకుంభాభిషేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే అభివృద్ధి

పాణ్యం: ప్రతిపక్షాలు కళ్లకు గంతలు కట్టుకుంటే అభివృద్ధి పనులు ఎక్కడ కనిపిస్తాయని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం పాణ్యంలో ఎన్నికల ప్రచారం అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నియోజకవర్గంలో కొత్త పరిశ్రమలు, నూతన ప్రాజెక్టులు, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు రైతులకు సాగునీరు అందించారన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. నాయకులు సుబ్బరాయుడు, పుల్లయ్య, పాలెం చంద్రశేఖర్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, టైలర్‌బాషా, సుబ్బయ్య, బొజ్జన్న పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కోడుమూరు రూరల్: హంద్రీనది ఎండిపోవడంతో పరివాహక ప్రాంతాలైన వర్కూరు, కోడుమూరు, ముడుమలగుర్తి, గోరంట్ల గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కోడుమూరు హంద్రీనదిలో పట్టణానికి సరఫరా చేసే బోరు పాయింట్లను ఎస్‌ఈ నాగేశ్వరరావు ఏఈ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఎండల దృష్ట్యా హంద్రీలో నీటి నిల్వలు వేగంగా తగ్గిపోతున్నాయని, తద్వారా పరివాహక ప్రాంతాల్లో తరచూ నీటి సమస్య తలెత్తుతోందన్నారు. పరిష్కారానికి హంద్రీనదికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతూ ఇరిగేషన్ అధికారులకు లేఖ పంపామన్నారు. త్వరలో హంద్రీకి నీరు విడుదలయ్యేలా చూస్తానని పేర్కొన్నారు.

జగనన్న అంటే సంక్షేమం.. బాబు అంటే కరువు

- సర్పంచ్‌గా అభివృద్ధి చేయలేనివాళ్లు గెలిస్తే ఎమ్మెల్యేగా ఎం చేస్తారు?
- పసుపుల ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్
- టీడీపీ అభ్యర్థి స్వగ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రచారానికి భారీ స్పందన



స్వాగతం పలుకుతున్న పసుపుల గ్రామస్తులు



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్

కర్నూలు (సిటీ): సంక్షేమ పథకాల సారథిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకుంటే.. చంద్రబాబు పేరు చెబితే వెన్నుపోటు, కరువు గుర్తుకు వస్తుందని వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్ రెడ్డి, ఎం.మణిగాంధీ అన్నారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని పసుపుల పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్వగ్రామమైన పసుపుల పంచాయతీలో వారికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. భారీ ఎత్తున డప్పు వాయిద్యాలు, టపాసులు కాల్చుతూ, బంతిపూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. అన్ని వర్గాలకు, పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ మాత్రమేనని అన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ఏ రోజు కూడా సొంతంగా పోటీ చేసి గెలవలేరని, జగనన్నను చూసి చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టడంతోనే కూటమిగా ఏర్పడి వస్తున్నారన్నారు. గతంలో ఏ పని కావాలన్నా కర్నూలు నగరానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే పౌర సేవలను అందిస్తున్నారని తెలిపారు. బాబు వస్తే జన్మభూమి కమిటీల్లోని తెలుగు తమ్ముళ్లదే పెత్తనం అవుతుందన్నారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి

గూడూరు రూరల్: రాష్ట్రంలో పేదలకు సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే సాధ్యపడుతుందని వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆర్.ఖానాపురంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ఐదేళ్లలో జరిగిన సంక్షేమాన్ని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా ఉండేవన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి పల్లెకు బీటీ, సీసీ రోడ్లు వేసి ప్రజల ఇబ్బందులు తొలగించారని తెలిపారు. ముప్పై ఏళ్లకు పైగా గూడూరు-కోడుమూరు రోడ్డు అధ్వానంగా ఉండడంతో బస్సు సౌకర్యంతో పాటు ఇతర రవాణ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ప్రజల కోరిక మేరకు గూడూరు నుంచి కోడుమూరుకు రూ. 6.50 కోట్ల నిధులతో రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. అలాగే ఆర్.ఖానాపురం నుంచి రేమటకు రూ. 2.50 కోట్లు వెచ్చించి బీటీ రోడ్డును వేసినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మరింత మేలు చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను విడుదల చేయనున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికి లబ్ధి చూకూరిందన్నారు. మరింత సంక్షేమం, అభివృద్ధి సాధించాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు, నాయకులు నరసింహారెడ్డి, ఎల్లారెడ్డి, మహేశ్వర రెడ్డి, దౌల, ప్రతాప్‌రెడ్డి, మాధవస్వామి, రామచంద్ర, కొండారెడ్డి, దివాకర్‌రెడ్డి, కలాంబాషా తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం ఎక్కువ.. అభివృద్ధి తక్కువ

కర్నూలు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న పసుపుల గ్రామ పంచాయతీలో ఆనాడు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, రాంభూపాల్ చౌదరి, వైఎస్సార్ హయాంలో జరిగిన పనులే కనిపిస్తున్నాయన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉంటున్న కుటుంబ సభ్యులే గ్రామ సర్పంచ్‌గా ఉన్నా మూడేళ్లలో ఏ అభివృద్ధి చేయలేదన్నారు. అలాంటి వారు నియోజకవర్గాన్ని ఏ రకంగా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. పసుపుల పంచాయతీ చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉందని, ఆ వ్యాపారం నుంచి పంచాయతీకి వచ్చే ఆదాయం ఎక్కువగా ఉన్నా అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదన్నారు. తాగునీరు, డ్రైనేజీ కాలువలు కూడా నిర్మించలేదంటే ఆ ఆదాయం ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, సింగిల్ విండో చైర్మన్లు వినయ్‌కుమార్ రెడ్డి, శేషిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మహబూబ్ బాషా, వైస్ ఎంపీపీ నెహిమియా, ఎంపీటీసీ సభ్యులు కృష్ణ, రామ్‌నాథ్‌రెడ్డి, హనుమంతు, మద్దిలేటి, నాయకులు శ్రీనివాసరెడ్డి, డి.వాసు, ప్రసాద్, చిన్నలక్ష్మన్న, మోహన్ బాబు, పంచలింగాల వెంకటేశ్వరరెడ్డి, జి.శింగవరం వెంకటేశ్వర రెడ్డి, పి.రుద్రవరం వెంకటేష్, బీచుపల్లి, సంపత్‌కుమార్, సంపత్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు జగన్‌ను గెలిపిద్దాం



కేతవరంలో ప్రచారం చేస్తున్న ఉమామహేశ్వరమ్మ

- ఎన్నికల ప్రచారంలో కాటసాని ఉమామహేశ్వరమ్మ

ఓర్వకల్లు: సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని కాటసాని ఉమామహేశ్వరమ్మ ప్రజలను కోరారు. శుక్రవారం ఓర్వకల్లు మండలంలోని కొంతలపాడు, కేతవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యం ప్రజాసంక్షేమానికి పాటు పడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందజేస్తున్న జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. టీడీపీ కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, సర్పంచ్‌లు మధుకేశన్న, గోవర్ధన్, ఎంపీటీసీ సభ్యులు పుల్లయ్య, లక్ష్మీదేవి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా, సిద్ధయ్య, రాము, కృష్ణ, పెద్దస్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లోదుక్కులతో మంచి ఫలితాలు



కియోస్క్ మిషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

గడివేముల: వేసవిలో లోదుక్కులు చేసుకోవడం, మట్టి పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగు చేయడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రావు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని దుర్వేసి గ్రామంలోని ఆర్బీకేను సందర్శించారు. ప్రతి ఒక్క రైతు వ్యవసాయాధికారుల సలహాలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆర్బీకేల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏ రవి కుమార్ తదితరలు ఉన్నారు.

మంచి చేసిన ప్రభుత్వానికి మద్దతివ్వండి

- చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మొద్దు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



బిలకలగూడూరు గ్రామంలో టీడీపీకి చెందిన ముస్లిం కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: అర్హతే ప్రమాణికంగా సంక్షేమాన్ని చేరువ చేసి పేదలకు మంచి చేసిన ప్రభుత్వానికి ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని చూసి మే 13వ తేదీ జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. జగన్ పాలనలో వైద్యం, విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి చూపించారన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రి రూపురేఖలను మార్చివేశారన్నారు. మహిళలు, పేదల ఆర్థికాభివృద్ధి కోసం ఎన్నో పథకాలు అమలు చేశారని చెప్పారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలతో జగన్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలన్నా.. రాష్ట్రాభివృద్ధి జరగాలన్నా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల సమయంలో చెప్పే మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయడానికి కూటమి పేరుతో విపక్షాలు ముందుకు వస్తాయని, అలాంటి వారిని నమ్మవద్దని ప్రజలను కోరారు. ఎన్ని కూటములు ఏర్పడినా వైఎస్సార్‌సీపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీలో 35 కుటుంబాలు చేరిక

బిలకలగూడూరు గ్రామంలో టీడీపీకి చెందిన 35 ముస్లిం కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. కొన్నేళ్లుగా టీడీపీలో ఉన్న రహింబేగ్, ఈసూఫ్ బేగ్, అబ్దుల్లా, అస్లంబాషా, అస్రఫ్, ఇమ్రాన్ బాషా తదితరలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, నాయకులు దస్తగిరిరెడ్డి, భాస్కర్ రెడ్డి, అనీష్, పఠాన్ సయ్యద్ బాషా, శంకర్‌రెడ్డి, మధుసూదన గుప్తా, దేశం నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, సీవీ రమణయ్య, మేఘనాథ్‌రెడ్డి, ఆర్‌ఏ సంజీవరెడ్డి, బాలచెన్ని, ప్రతాపరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మహేశ్వరరెడ్డి, శివానందరెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, సర్వేశ్‌రెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రఘు మాధవరెడ్డి తదితరలు పాల్గొన్నారు.

పేదల ఇంట సంక్షేమ కాంతులు

కల్లూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల ఇళ్లలో కాంతులు నింపుతున్నాయని కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో ఆయన ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయమన్నారు. పేదల జీవితాలు మార్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలు అమలు చేశారన్నారు. వివిధ వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న వైఎస్ జగన్‌కు మద్దతుగా మే13న రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలన్నారు. ఐదేళ్లలో కర్నూలు నగరంతో పాటు కల్లూరు అర్బన్ వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులు చేశామన్నారు. కల్లూరు అర్బన్ విస్తరిస్తుండడంతో ప్రాధాన్యతలను అనుసరించి డ్రైనేజీలు, కల్వర్టులు, రోడ్లు వేశామన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ముంగిట్లో పశువైద్యం

- పశువుల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత
- ఇంటి ముంగిట్లోకి వైద్యసేవలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 46,87,891 పశుసంపద
- నేడు ప్రపంచ పశువైద్య దినోత్సవం
- ఫన్ అండ్ ఫుడ్‌లో పశువైద్యులకు అవగాహన సదస్సు



కర్నూలు (అగ్రికల్చర్): పశువులు జ్వరమొచ్చినా... ఇతరత్రా ఏ కష్టం వచ్చినా చెప్పుకోలేవు. నోరు లేని ఈ జీవాలకు జబ్బు చేస్తే పాడి రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం పశువైద్య సేవలు రైతుల ముంగిటకే వస్తున్నాయి. ఒక్క ఫోన్‌కాల్‌తో పశువు ఉండే చోటుకే నిపుణులైన వైద్యులు వచ్చి వైద్యం అందిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి గ్రామంలో పశు వైద్య సహాయకుల సేవలు అందుబాటులోకి వచ్చాయి. నేడు ప్రపంచ పశు వైద్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

పశు సంపదకు జిల్లా పెట్టింది పేరు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 140 పశువైద్యశాలలు(వెటర్నరీ డిస్పెన్సరీలు), 28 ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్, 175 గ్రామీణ పశువైద్యశాలలున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. కర్నూలు జిల్లాలో 466, నంద్యాల జిల్లాలో 411 ఆర్‌బీకేలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ పశువైద్య సేవలు అందుతుండటం విశేషం. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 1,218 గ్రామాలకు పశువైద్య సేవలు విస్తరించడం విశేషం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 46,87,891 పశుసంపద ఉంది. పశువైద్యులు ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటేనే పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రతిఏటా ఏప్రిల్ నెల చివరి శనివారాన్ని ప్రపంచ పశువైద్య దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. 2001 నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తూ పశువైద్యులకు వృత్తి నైపుణ్యాలను పెంచుతున్నారు. పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కిసాన్ ఘాట్‌లోని ఫన్ అండ్ ఫుడ్‌లో పశువైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య హాజరు కానున్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన పశువైద్యాధికారులను సత్కరించనున్నారు.

మానవాళిని కాపాడే ఆరోగ్య కార్యకర్తలు పశువైద్యులు

పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా ఒక థీమ్(ప్రత్యేకత) ఇస్తుంది. దీనిపై పశుసంవర్ధకశాఖలోని వెటర్నరీ అసిస్టెంటు సర్జన్స్, అసిస్టెంటు డైరెక్టర్లకు మరింత అవగాహన కల్పిస్తారు. ఈ ఏడాది థీమ్ 'వెటర్నేరియన్స్ ఆర్ ఎసెన్సీయల్ హెల్త్ వర్కర్స్' అంటే మానవులను కాపాడే ఆరోగ్య కార్యకర్తలు పశువైద్యులు. పశు పక్ష్యాదులు ఆరోగ్యంగా ఉంటే మానవాళి కూడా ఆరోగ్యంగా ఉంటుందని అర్థం.

మూగజీవుల ఆరోగ్యానికి పెరిగిన ప్రాధాన్యత

2019-20 నుంచి ఇప్పటి వరకు పశుసంపద ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా నోరులేని మూగజీవుల వైఎస్ఆర్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌ల ద్వారా ప్రభుత్వం సత్వర వైద్య సేవలు అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పశువైద్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం విశేషం. మూగజీవుల ఆరోగ్య పరిరక్షణ కోసం 108. 104 తరహాలోనే వైఎస్ఆర్ సంచార పశువైద్య సేవ రథాలను వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వీటి ద్వారా పశు సంపదకు అత్యవసర వైద్య సేవలు అందుతున్నాయి. రైతుకు వ్యవసాయం ఎంత ముఖ్యమో... పాడి కూడా అంతే ముఖ్యం. అందుకే పెద్దలు రైతు ఇంట పాడిపంట అన్నారు. ప్రభుత్వం కూడా రైతుల ఇంట పాడిని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. పశుపోషణ, పరిశుభ్రమైన పాల ఉత్పత్తి, దూడల మరణాలు తగ్గించడం తదితర వాటిపై రైతులకు సమగ్రంగా అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా గతంలో ఎప్పుడూ లేని విధంగా పశుసంవర్ధకశాఖ ఈ ఏడాది నుంచి పశు విజ్ఞానబడి అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.



మూగజీవులకు చికిత్స అందచేస్తున్న పశువైద్యులు

పశువుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



మూగ జీవుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. పశుసంపద ఆరోగ్యంగా ఉంటే మానవాళి ఆరోగ్యంగా ఉంటోంది. వైద్యం చేయ డం అంతసులువు కాదు. అవి తమ బాధను చెప్పుకోలేవు.పశువైద్యులు ఎన్నో ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న పశువులకు వైద్యం చేసి కాపాడుతున్నారు. ప్రతి ఏటా ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని నిర్వహిస్తూ వివిధ ప్రధాన అంశాలపై నిపుణులతో పశువైద్యులకు అవగాహన కల్పిస్తున్నాం. పశుసంపద ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా పశువులకు టీకాలు వేయించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ జి.శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ, కర్నూలు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



మొదటి స్థానంలో నిలిచిన ఎద్దులు

సి.బెళగల్: క్రిష్ణదొడ్డి గ్రామంలో కోన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 14 జతల ఎద్దులు పోటీలో పాల్గొన్నాయి. పెద్దనేలటూరు గ్రామ రైతు సీతారాముడు, పంచలింగాల రైతు మహేంద్ర బాబుకు చెందిన ఎద్దులు 15 నిమిషాల్లో సంయుక్తంగా 4,510 అడుగుల దూరం లాగి మొదటి స్థానంతో నిలిచాయి. రూ.40 వేలు అందుకున్నారు. పి.రుద్రవరం గ్రామానికి చెందిన రైతు గోపాల్ గౌడ్ ఎద్దులు 4,206 అడుగులు లాగి రెండో స్థానంలో రూ.30 వేలు, గద్వాల జిల్లా గట్టు మండలం రామాపురానికి చెందిన నల్లారెడ్డి ఎద్దులు 4,016 అడుగులు లారి మూడో స్థానంలో రూ.20 వేలు, డోన్ మండలం మల్యాల గ్రామ రైతు షేక్ మహిములన్న, కొచ్చెరు గ్రామ రైతు బజారి లక్ష్మీదేవమ్మల ఎద్దులు సంయుక్తంగా 4,000 అడుగులు లాగి నాల్గో స్థానంలో రూ.10 వేలు, గద్వాల జిల్లా జమ్మిచేడు గ్రామ రైతు వెంకటేష్, సి.బెళగల్ మండలం ఇనగండ్ల గ్రామ రైతు తిరుమలేష్ ఎద్దులు సంయుక్తంగా 3,932 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో నిలిచాయి. రైతులకు రూ.6 వేల నగదు అందజేశారు. పోటీలను తిలకించేందుకు స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పోటీలకు వ్యాఖ్యాతలుగా వేమారెడ్డి, వెంకటరాముడు వ్యవహరించారు. వారం రోజులుగా గ్రామంలో జరుగుతున్న స్వామివారి ఉత్సవాలు ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు.